క్లుప్తంగా

ఆధార్ సేవలు ప్రారంభం



ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున

వరికుంటపాడు: వరికుంటపాడులోని మీసేవ, సీఎస్‌సీ కేంద్రంలో గురువారం తహసీల్దార్ ఎస్.మల్లికార్జున ఆధార్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్‌కార్డులకు సంబంధించి అన్ని రకాల మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, నాయకులు తిరుపతినాయుడు, బి.వెంకటేశ్వర్లురెడ్డి, యర్రా ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత



కావలి: పట్టణంలోని వెంగళరావునగర్, జంగాలకాలనీల్లో ఇటీవల అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన దుడ్డు వరలక్ష్మి కుటుంబానికి రెడ్‌క్రాస్ తరఫున సాయం అందజేస్తున్నట్లు కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ తెలిపారు. గురువారం కావలిలో వరలక్ష్మి కుటుంబానికి రెడ్‌క్రాస్ బృందం తక్షణ సహాయ సామగ్రిని అందజేసింది. తాత్కాలిక నివాసం ఏర్పరచుకోవడానికి టార్పాలిన్ పట్ట, వంట పాత్రలు, హైజీన్ కిట్‌తో కూడిన సహాయ సామగ్రి జిల్లా రెడ్‌క్రాస్ తరఫున అందజేసినట్లు రవిప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, జిల్లా పాలకమండలి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కె.రాజశేఖర్, పల్లకి లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



ఉదయగిరి: దేశవ్యాప్తంగా తపాలా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా గురువారం ఉదయగిరి సబ్ పోస్టాఫీసు కార్యాలయ పరిధిలోని తపాల సిబ్బంది కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జీడీఎస్ ఉద్యోగుల సంఘం కావలి బ్రాంచ్ కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కమలేష్‌చంద్ర కమిటీలోని సానుకూల సిఫార్సులను అమలుచేయాలన్నారు. బ్రాంచ్ పోస్టాఫీసులను 8 గంటల పనిదినాలుగా చేసి డిపార్ట్‌మెంట్‌లో కలపాలన్నారు. కార్యక్రమంలో కుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కావలి : పట్టణంలోని కొనదిన్నె గిరిజన కాలనీ వద్ద తాత వెంకటరమణయ్య(40) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కావలి వన్ టౌన్ సీఐ కె. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు కావలి రూరల్ మండలం అల్లిగుంటపాళెం గ్రామానికి చెందిన తాత వెంకటరమణయ్య రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం మండలంలోని కోనేటివారిపాళెం గ్రామంలో బంధువుల కర్మకాండలకు వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యతో వాగ్వాదం జరిగి పంటలకు పిచికారీ చేసే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి

చేజర్ల: సోమశిల ప్రాజెక్ట్ దక్షిణ కాలువ ద్వారా చేజర్ల మండల రైతులకు సాగునీరు ఇవ్వాలని రైతులు కోరారు. గురువారం మండలంలోని నాగులవెల్లటూరు రోడ్డులో, కలువాయి, పాదలకూరు మెయిన్ రోడ్డులో రైతులు మాట్లాడుతూ తమ పొలాలకు సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం వేకువజామున నగరంలోని విజయమహల్ గేటు సమీపంలో నెల్లూరు వైపు వెళ్లే రైలుపట్టాలపై చోటు చేసుకుంది. మృతుడి వయసు 65 నుంచి 70 ఏళ్లలోపు ఉండవచ్చు. బ్లూ కలర్‌పై వైట్ కలర్ చుక్కలు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, వైట్ కలర్ పంచె ధరించి ఉన్నాడు. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని వేంపాడు గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రంలో సంక్షేమ బావుటా ఎగురవేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలు గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు భేదాన్ని గమనించి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. అనంతరం ప్రజా సంక్షేమ బావుటా బుక్‌లెట్లు ప్రజలకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, సర్పంచ్ టి.వి జయమ్మ, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యుడు జిలానీ బాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, నాయకులు ఎం.తిరుపతినాయుడు, జి.మల్లికార్జున, టి.అబూసలాం, సీహెచ్ ఆవులయ్య, డి.చెన్నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



క్రీడా సామగ్రి అందిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 సచివాలయాలకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర ఆట వస్తువులు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యం కనబరిచి రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడోత్సవాలను అధికారులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ మల్లికార్జున, సర్పంచ్ దిలీప్‌కుమార్, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, మండల కోఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసులు, నాయకులు ఎం.తిరుపతినాయుడు, దాసరి యర్రా ఓబయ్య, డి.చెన్నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కావలి: కావలి నియోజకవర్గంలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు గురువారం తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు 9959225643 నంబర్‌కు ఫోన్ చేసి బస్సు సర్వీసులకు సంబంధించి తమ సూచనలు, సలహాలు ఇచ్చి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆత్మకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ముస్తాపురంలో పలు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, కౌన్సిలర్ ఎం.రాజశేఖర్ విద్యుత్ సిబ్బందితో గురువారం నూతన స్తంభాలను ఏర్పాటు చేయించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు చేయూత



పరిహారం అందజేస్తున్న తహసీల్దార్

చేజర్ల: మిచాంగ్ తుపాన్ కారణంగా మండలంలో ఇళ్లు దెబ్బతిన్న 20 మంది బాధితులకు గురువారం చేజర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా రూ.1,64,000 నష్ట పరిహారం అందించారు. పెరుమళ్లపాడులో ఇద్దరికి, వావిలేరులో ఒకరికి, మడపల్లిలో ఒకరికి, టీకేపాడులో ముగ్గురికి, కాకివాయిలో 10 మందికి, చిత్తలూరులో ముగ్గురికి ఈ పరిహారం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ పాల్గొన్నారు.

గేదెను ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంట సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న కారు ఏపిలగుంట సమీపానికి వచ్చేసరికి ఓ గేదె రోడ్డుపైకి రావడంతో దానిని ఢీకొంది. గేదెకు తీవ్రగాయాలు కాగా కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత



ఆత్మకూరురూరల్: మండలంలోని బండారుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కర్ణం కార్తీక్ గురువారం కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అహమ్మద్‌బాషా, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు విద్యార్థులతో కలిసి దాతను సన్మానించారు.

సబ్సిడీపై వరి విత్తనాలు



రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందజేసిన ఏఓ శ్రీహరి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

సంగం: మిచాంగ్ తుఫాన్ కారణంగా నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు అందచేస్తున్నారు. గురువారం మండలంలోని తరుణవాయి రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడులు దెబ్బతిన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ గీత, రైతులు పాల్గొన్నారు.

దగదర్తి మండలంలో..

కావలి: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దగదర్తి మండలంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుందని ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు తెలిపారు. ప్రభుత్వం అందజేసిన సబ్సిడీ వరి విత్తనాలను దగదర్తిలో గురువారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో వరి నారు, నాట్లు భారీ వర్షాలకు మునిగిపోయిన నేపథ్యంలోం నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం వరి విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చలంచర్ల శీనయ్య, వైస్ సర్పంచ్ కడియాల నాగేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ సాయం అందజేత



నగదు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్

ఆత్మకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నష్టపోయిన పలువురు బాధితులకు ప్రభుత్వ సాయం అందజేస్తున్నారు. గురువారం 17వ వార్డు పరిధిలోని సచివాలయంలో తుఫాన్ బాధిత కుటుంబాలకు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ రూ.2,500 నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రభావతి, సచివాలయ అడ్మిన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ప్రవాస భారతీయుడు



శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి గంగిరెడ్డి, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్, సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల అమలు గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, ఎంఆర్‌జీ రాజేంద్రకుమార్, కాంప్లెక్స్ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, మహిమలూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్, విశ్రాంత ఉపాధ్యాయులు అచ్చమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలను జయప్రదం చేయండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను అన్ని సచివాలయాల ఉద్యోగులు, పాఠశాలల ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని వాశిలి సచివాలయం, ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి క్రీడోత్సవాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరువేయాలని, ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆత్మకూరు మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుందని, ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసుంధరాదేవి, పంచాయతీ కార్యదర్శి పర్వీన్, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



కలిగిరి ఎస్సై సంతోష్‌కుమార్



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుమన్



చేజర్ల నూతన ఎస్సై ప్రభాకర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై ఉమాశంకర్

కలిగిరి: కలిగిరి ఎస్సైగా సి.సంతోష్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు తెలపవచ్చని సూచించారు.

వరికుంటపాడు: వరికుంటపాడు నూతన ఎస్సైగా ఎస్.సుమన్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఫిర్యాదుదారులు నేరుగా స్టేషన్‌కు వచ్చి నిర్భయంగా తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

చేజర్ల ఎస్సైగా ప్రభాకర్

చేజర్ల: చేజర్ల నూతన ఎస్సైగా ఎస్.ప్రభాకర్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుత్తలూరు ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై చేజర్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

దుత్తలూరు: దుత్తలూరు నూతన ఎస్సైగా ఎం.ఉమాశంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు సీసీఎస్‌లో పనిచేస్తూ బదిలీపై దుత్తలూరుకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జలదంకి మండలానికి సాగునీరివ్వండి

• మంత్రి కాకాణిని కోరిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మంత్రి కాకాణితో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: మండలంలోని అన్ని చెరువులకు సోమశిల జలాశయం నుంచి కావలి కాలువ ద్వారా సాగునీరు అందించాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన నెల్లూరులో గురువారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి జలదంకి మండల రైతుల విజ్ఞప్తిని వివరించారు. జలదంకి మండలంలో రైతులు ప్రస్తుతం వరినాట్లు వేసుకుని ఉన్నారని, పంటలు ఎండకుండా సాగునీరు అందేలా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే సోమశిల అధికారులకు ఫోన్ చేసి జలదంకి మండల రైతుల సమస్యను తెలిపి మండలంలోని అన్ని చెరువులకు సాగునీరు అందించాలని ఆదేశించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి సోమశిల ఎస్ఈ రమణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. చెరువులన్నింటికీ జనవరి మొదటి వారంలో నీరు విడుదల చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జలదంకి మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వేములపాడు సర్పంచ్ బీవీ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో అయ్యప్పస్వామి పడిపూజ గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణపతిస్వామి, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించారు. అయ్యప్ప మాలధారులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భజన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంధన పొదుపు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

కావలి : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఇంధన పొదుపుపై ప్రజలను చైతన్యవంతులను చేసేలా రూపొందించిన పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయరాదని, మిగులు విద్యుత్ రాబోయే తరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ కేఎస్ బెనర్జీ, డిప్యూటీ ఈఈ శంకరయ్య, ఏఈఈ వై.వసంతరావు, కావలి టౌన్–1, టౌన్–2 విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు

• బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా వీరానాయక్ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరానాయక్

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేస్తామని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. దీంతో సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ డి.హిమవతి, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరానాయక్ ఆర్ఎస్ఐగా 2002లో పోలీస్ శాఖలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం సివిల్‌కు కన్వర్షన్ అయ్యి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఎస్ఐగా పనిచేశారు. సీఐగా పదోన్నతి పొంది గుంటూరు ట్రాఫిక్, బాపట్ల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో బాలాజీనగర్‌లో పనిచేస్తున్న రాములునాయక్ గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరానాయక్ నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పూర్తిస్థాయిలో పరిరక్షిస్తామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100, 94407 96311 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పూజలు, ఉత్సవాలు, సేవలను విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, కొండ్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాంతమ్మ, బయ్యపురెడ్డి ఈశ్వర్‌రెడ్డి, పద్మ, దేవరాల శ్రీనివాసులు, రాజేశ్వరి, లోకేశ్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, బి.మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.